


# సూర్య
www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,11 జనవరి 2026

8 పేజీలు


## ప్రజల శాంతి - మన అందరి బాధ్యత

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు

- కులమతాల మధ్య చిచ్చు పెట్టే శక్తుల పట్ల ఉక్కుపాదం..
- శాంతి భద్రతల విషయంలో రాజీ లేదు !
- కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్ష
- సాంకేతికతను సామాన్యుడి రక్షణకు ఆయుధంగా మలచాలని సూచన...
- శాంతిని కోరుకునే వారికే ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య...


సాంకేతికతను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి



**ఉమ్మడి గోదావరి జిల్లాలో సూర్య బ్యూరో :**


రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, సామాన్య పౌరుడికి అండగా నిలుస్తూ భరోసా కల్పించడమే పరమావధిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారంకాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో పర్యటించి, వ్యవస్థలో జరగాల్సిన సమూల మార్పులపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో కులాలు,మతాలమధ్య విద్వేషపు చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసే విచ్ఛిన్నకర శక్తుల పట్ల రాజీలేని పోరాటం చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ప్రతిపౌరుడు ధైర్యంగా నిద్రపోయే వాతావరణం ఉన్నప్పుడే సమాజంఅభివృద్ధిపథంలో పయనిస్తుందని, అందుకే నిబంధనలు పక్కాగా అమలుచేస్తూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి 'డయల్ 100' పనితీరును స్వయంగా పరిశీలించిన ఆయన,సాంకేతికతను సామాన్యుడి రక్షణకు ఆయుధంగా మలచాలని, ఆపదలో ఉన్నబాధితులకు సెకన్ల వ్యవధిలో సహాయం అందేలా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు భయం కాకుండా భరోసా ఇచ్చేలా ఉండాలని, స్నేహపూర్వక సేవల ద్వారా వ్యవస్థను సామాన్యులకు మరింత చేరువ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్‌లతో కలిసి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. శాంతిని కోరుకునే పౌరులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, శాంతికి విఘాతం కలిగించే శక్తులకు శిక్ష తప్పదని ఈ పర్యటన ద్వారా ఆయన జాతీయ స్థాయి విలువలతో కూడిన ఒక బలమైన సామాజిక సందేశాన్ని ప్రజల హృదయాలకు హత్తుకునేలా పంపారు.

## అవినీతి 'మత్తు'లో

# లిక్కర్ కోట..!

- నిబంధనలన్నీ బూడిదలో పోసిన పన్నీరేనా..?
- ఒకే డోర్ నంబర్ 13-1-56/1పై 'డబుల్ లైసెన్స్' దందా!
- మున్సిపల్ ప్లాన్ లేదు..ఫైర్ సేఫ్టీ సున్నా..ప్రజల ప్రాణాలతో 'ఓపెన్ రూఫ్' జూదం!







సూర్య
కాకినాడ స్మార్ట్ సిటీలో నిబంధనలకు తూట్లు
ప్రాణ సంకటంగా మారిన
'లిక్కర్ కోట'!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కాకినాడ నగర నడిబొడ్డున ఒక భయంకరమైన విజయవాడ స్వర్ణ ప్యాలస్ ఘటనలాంటి 'మృత్యు పాశం' సిద్ధమవుతోంది. చట్టాలను చుట్టాలుగా మార్చుకుని, అధికారుల జేబులు నింపి, నిబంధనలను బేరానికి పెట్టి ఒక మద్యం సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్నారు. లిక్కర్ కోట భవనంలో రాబోతున్న బార్ అండ్ రెస్టారెంట్ వ్యవహారం ఇప్పుడు కాకినాడ ఎక్సైజ్, ఫైర్ మరియు టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి పరాకాష్టగా నిలుస్తోంది. అడుగడుగునా చట్టాలను ధిక్కరిస్తూ, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ఈ 'లిక్కర్ కోట'ను నిర్మిస్తున్న తీరుపై 'సూర్య బ్యూరో' ప్రత్యేక కథనం.

**బ్లూ ప్రింట్‌లోనే 'బ్లాక్' అవినీతి!**

ప్రస్తుతం ఈబార్ ప్రారంభ దశలో ఉంది. యజమానులు అప్లికేషన్లు పెట్టుకోవడం, అధికారులు వచ్చి తనిఖీలు చేయడం చకచకా సాగిపోతున్నాయి. అయితే, ఈ తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు తమ కళ్లకు 'కాసుల' గంతలు కట్టుకున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా భవనం పైన ఏర్పాటు చేయబోతున్న 'ఓపెన్ స్కై రూఫ్ బార్' నిబంధనల అతిక్రమణకు పరాకాష్టగా తెలుస్తోంది..

**ఓపెన్ స్కై రూఫ్ బార్ – ఒక అగ్నిగుండం!**

భవనం పైన ఓపెన్ రూఫ్ బార్ ఏర్పాటు చేయాలంటే నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్.బి.సి.) 2016 ప్రకారం అత్యంత కఠినమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి. స్లాబ్ పైన వందలాది మంది కూర్చునే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే, వారు ప్రాణాలు కాపాడుకోవడానికి కనీసం రెండు వెడల్పైన స్వతంత్ర దారి మార్గాలు ఉండాలి.

- తరువాయి 2లో..

## నెలలో ఒక రోజు పల్లెబాట పట్టండి

### పేదలకు ప్రాణదాతలుగా నిలవండి !
### వైద్యులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు



- రంగరాయ మెడికల్ కళాశాల నూతన భవనాలకు శంకుస్థాపన
- రూ.10.11 కోట్లతో పూర్వ విద్యార్థుల వితరణ
- మొబైల్ డెంటల్ స్క్రీనింగ్ వాహనాల ప్రారంభం



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

వైద్యులు సమాజానికి వెన్నెముక అని, దేవుడితో సమానమైన గౌరవం పొందే వైద్య వృత్తిలో ఉన్నవారు నెలలో కనీసం ఒక్క రోజైనా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వెళ్లి సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. శనివారం కాకినాడలోని చారిత్రాత్మక రంగరాయ మెడికల్ కళాశాలలో

- తరువాయి 2లో..



# నేటి నుండి ఆత్రేయపురంలో కాటన్ ట్రోఫీ సంక్రాంతి సంబరాలు





- సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కమిటీ సభ్యులు అధికారులు ప్రజా ప్రతినిధులు
- టూరిజం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఆత్రేయపురం ఉత్సవంతో కోనసీమ కీర్తి దశ దశలా వ్యాప్తి
- స్పీడ్ బోట్ పై విహరించి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఆత్రేయపురంలో 11 నుంచి 13 వరకు నిర్వహించనున్న సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ (సంక్రాంతి సంబరాలు) పడవ, ఈత, పతంగులు, ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధమైంది. ప్రభుత్వ అధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరగనున్నఈపోటీలలో జిల్లాలకు చెందినజట్లు తలపడను న్నాయి. జాతీయ,అంతర్జాతీయ క్రీడాకారులరాక, అంతర్జాతీయ జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొననున్నారు ఆత్రేయపురం లాకులు తాడిపూడి వంతెన పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు దేశంలో, ప్రపంచంలో ఎక్కడ స్థిరపడి ఉన్నా కుటుంబ సభ్యులు అందరూ ఒక చోట చేరి జరుపుకునే పండుగ సంక్రాంతి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు ఆత్రేయపురం వైభవాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

రేపటి నుంచి ఆత్రేయపురంలో జరగనున్న సంక్రాంతి ఉత్సవం గురించి మాట్లాడుతూ కోనసీమను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పవిత్రమైన గోదారమ్మపై సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఆనకట్ట కట్టి నీటిపారుదల వ్యవస్థ ఏర్పాటు చేయడంతోటే మన రైతులు పంటలు పండించి మనం అన్నం తినగలుగుతున్నామని, మహనీయుడు కాటన్ చేసిన సేవలను విద్యార్థులకు గుర్తు చేశారు. ఆయన పేరు మీద జరుగుతున్న ఈపోటీలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతా యన్నారు. ఆదివారం ఈతపోటీలు,రంగవల్లుల పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు.ఎల్లుండి డ్రాగన్‌పడవలపోటీలు జరగనున్నాయన్నా రు. లొల్ల లాకుల దగ్గర ఫుడ్ ఫెస్టివల్ జరగనుందన్నారు. ఆత్రేయపురం తాడిపూడి వారధి వద్ద ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజుల పాటు ఉత్సవం జరగనుందన్నారు. మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల ప్రాంగణం అనేక పోటీలకు వేదిక కానున్నదని తెలిపారు. ఆత్రేయపురం పూతరేకు అంటే ప్రపంచ ప్రసిద్ధి అన్నారు. అలాగే ఆత్రేయపురం ఉత్సవం కూడా అందరూ చెప్పుకునేలా ఉంటుందన్నారు. శతమానం భవతి హీరో శర్వానంద్ రానున్నారని తెలిపారు స్పీడ్ బోటులు నేడు రాబోతున్నాయని, రేపు వాటర్ బైక్‌లు ప్రారంభం కాబోతున్నాయని అన్నారు. లొల్ల లాకుల వద్ద వాటర్ ఫౌంటైన్‌లు చూడబోతున్నారని, డ్రోన్ షో జరగనుందన్నారు.

వాడపల్లి వెంకన్న కీర్తి దశదిశలా వెలుగొందుతున్న రీతిలో ఇక్కడప్రజలుఅభివృద్ధిచెందే విధంగాచేస్తున్నామ న్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రజలు ఏది కోరుకుంటున్నారో అది చేస్తున్న ప్రభుత్వమన్నారు.అందరూ ఉత్సవాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీ మోహన్ బోటుపై విహరించారు. ఈకార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టీడీపిఅధ్యక్షులు కూనంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్, ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్, తాసిల్దార్ రామచంద్రమూర్తి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఆర్.ఐ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**అగిరిపల్లి, మేజర్‌న్యూస్:** మండల పరిధి పోతవరప్పాడు గ్రామ శివారు గోపాలపురంలో గల ఎన్.ఆర్.ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల శనివారం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా పాల్గొన్న ఏలూరు ఆర్‌టీఓ ఎస్.బాలేందు శేఖర్, కృష్ణా వేనీ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (అగిరిపల్లి) మరియు అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యతపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అతిథులుగా సంస్థ చైర్మన్ డా. రావి వెంకట్ రావు,సీఈఓ ఎం. తేజ సాయి, ప్రిన్సిపాల్ డా.సి.నాగ భాస్కర్ , డైరెక్టర్ డా. జి.సాంబ శివ రావు పాల్గొని విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా రంగవల్లులు, సంప్రదాయ వస్త్రధారణ, భోగి పండుగ విశేషాలు, సంప్రదాయ ఆటలు ,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# పిఠాపురంలో ముగిసిన పవన్ పర్యటన

- పవన్ పర్యటనలో అడుగడుగునా కనిపించిన అధికారుల నిర్లక్ష్యం
- పార్టీ కార్యకర్తలతో నిండిన విఐపి, ప్రెస్ గ్యాలరీలు
- సంక్రాంతి సంబరాల్లో సామాన్యులకు దక్కని చోటు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఉత్సాహంగా సాగింది. మొదటిరోజు సంక్రాంతి ఉత్సవాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొని వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే కొమ్ము, కోయ నృత్య రీతులను తిలకించారు. ధింసా కళాకారులతో కలిసి ఆడి పాడారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా గొల్లప్రోలు హౌసింగ్ కాలనీలో నిర్మించిన నూతన బ్రిడ్జిని సందర్శించారు.అనంతరం కాకినాడకు తిరుగు పయనమయ్యారు.

–గ్యాలరీల నిర్వహణలో అధికారులు విఫలం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన మరియు బహిరంగ సభ సందర్భంగా ఆర్ఆర్బీ హెచ్ ఆర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తగిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన విఐపి మరియు ప్రెస్ గ్యాలరీలు పార్టీ నాయకులు కార్యకర్తలతో నిండిపోవడంతో సభకు హాజరైన విఐపి మరియు మీడియా బృందాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పటిష్ట ఏర్పాట్ల పేరుతో అధికారులు హడావిడి చేసినా చివరకు గ్యాలరీల నిర్వహణలో విఫలం అయ్యారన్న అపవాదులు మూట కట్టుకోవాల్సి వచ్చింది.

–నిరాశపరచిన రెండవ రోజు సంక్రాంతి సంబరాలు

మొదటిరోజు జరిగిన అంత ఉత్సాహంగా రెండవ రోజు సంబరాలు జరగలేదన్న వాదనలు వినిపించాయి. మొదటి రోజు ఉత్సవాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొనడంతో అధికారులు దగ్గరుండి అన్ని కార్యక్రమాలు పర్యవేక్షించారు. రెండో రోజు ఉత్సవాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొనక పోవడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపించాయి. ముందస్తుగా ప్రకటించిన అతిథులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో...రెండో రోజు సంక్రాంతి సంబరాలు తిలకించేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగారు. అసలైన జన సైనికులకు మరియు సామాన్య ప్రజలకు ఉత్సవాల్లో చోటు తగ్గకపోవడంతో, కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో నిలబడే ప్రదర్శనలను తిలకించాల్సి వచ్చింది. రెండో రోజు ఉత్సవాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొనకపోయినా అధికారులు కాస్త చొరవ తీసుకుని ఉంటే బాగుండేది అన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# అవినీతి 'మత్తు'లో లిక్కర్ కోట..!

మొదటిపేజీ తరువాయి

కానీ ఇక్కడ ఉన్న ఒకే ఒక ఇరుకైన మెట్ల దారిని చూసి కూడా ఫైర్ అధికారులు మౌనంగా ఉండటం వెనుక ఉన్న మతలబు ఏమిటి?

**పాత ఎన్.ఓ.సి.తో కొత్త మోసమట.. ఇది నిజమేనా?**

ఈ భవనానికి ఉన్న ఫైర్ సేఫ్టీ అనుమతులు కేవలం పాత నిర్మాణానికి, అందులోని వాకింగ్ మాల్‌కు మాత్రమే పరిమితం. అప్పుడు బార్ లేదు, అక్రమపై అంతస్తు లేదు.ఇప్పుడు భవన స్వరూపం పూర్తిగా మారుతోంది. ఏపీ ఫైర్ సర్వీస్ యాక్ట్ 1999లోని సెక్షన్ 13 ప్రకారం..భవనంలో మార్పులు చేసినా లేదా అదనపు అంతస్తులు నిర్మించినా తప్పనిసరిగా నూతన ఫైర్ ఎన్.ఓ.సి.తీసుకోవాలి.టౌన్ ప్లానింగ్ అనుమతులు లేని అక్రమ మూడవ అంతస్తుకు కొత్త ఎన్.ఓ.సి.రాదు కాబట్టి, పాత సర్టిఫికేట్ తోనే నెట్టుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చి చట్టవిరుద్ధం.

**ఒకే డోర్ నంబర్ – రెండు లైసెన్సుల 'మాయ':** ఏపీ ఎక్సైజ్ రూల్స్ 13&26ను పరిశీలిస్తే..రిటైల్ మాల్ మరియు బార్‌లకు విడివిడి హద్దులు, విడివిడి దారులు ఉండాలి. కానీ ఇక్కడ 13-1-56/1 అనే ఒకే డోర్ నంబర్ మీద రెండు లైసెన్సులు పొందేలా అవకాశం ఇవ్వడం ఎక్సైజ్ అధికారుల ధనదాహానికి నిదర్శనం. ఒకే దారి గుండా వాకింగ్ మాల్ కస్టమర్లు, బార్ కస్టమర్లు వెళ్లడం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు, భద్రతల సమస్యకు కూడా దారితీస్తుంది.

**టౌన్ ప్లానింగ్ 'తోడు' – ఎక్సైజ్ అధికారుల 'నీడ'!**

మున్సిపల్ ప్లాన్‌లో లేని అదనపు అంతస్తు వెలుస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రపోతున్నారా? లేక లిక్కర్ కోట పంపిన నజరానాలతో కళ్లు మూసుకున్నారా? విజయవాడ 'స్వర్ణ ప్యాలెస్' సృష్టించిన మంటల కల్లోలం నుంచైనా గుణపాఠం నేర్వని ఎక్సైజ్ అధికారులు, కేవలంకమిషన్ల కోసం ప్రాణాలతో జూదం ఆడుతున్నారు. వ్యవస్థలను మేనేజ్‌చేస్తూ మద్యం వినియోగదారులను ప్రమాదంలో పడేసే ఈ 'లిక్కర్ కోట మాఫియా' వెనుక ఉన్న సూత్రధారులు ఎవరో తేలాల్సి ఉంది.

విజయవాడ స్వర్ణ ప్యాలస్ లాంటి ఘటనలు పునరావతము అయ్యే అవకాశం ఉందా...అవును అనేలా అత్యంత ప్రమాదకరమైన జ్వలనశీల పదార్థమైన మద్యం నిల్వ చేసే చోట, కనీస భద్రత లేని ఓపెన్ రూఫ్ బార్ నిర్వహించడం అంటే ప్రాణాలతో చెలగాటమాడటమే. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ ప్రాణనష్టానికి ఎక్సైజ్, ఫైర్ మరియు మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ప్రారంభ దశలోనే ఈ అక్రమ లిక్కర్ కోటను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

# నెలలో ఒక రోజు పల్లెబాట పట్టండి

మొదటిపేజీ తరువాయి

పూర్వ విద్యార్థుల సంఘం రాంకోసా ఆధ్వర్యంలో రూ.10.11 కోట్లతో నిర్మించనున్న నూతన భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

**వైద్యో నారాయణో హరి..** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్‌ప్రసంగిస్తూ.. "తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునం ర్జన్మనిస్తారు. అందుకే వైద్యులను దేవుడితో పోలుస్తాం. రంగరాయ మెడికల్ కాలేజీకి ఘనమైన చరిత్ర ఉంది.1958లో ప్రారంభమైన ఈ సంస్థ ఎందరో మహనీయుల కృషి, దాతల త్యాగాల ఫలితం. నేడు అదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు తమ సొంత నిధులతో కళ శాల అభివృద్ధికిముందుకురావడంఅభినందనీయం"అని కొనియాడారు.

**గిరిజన ప్రాంతాల్లో సేవలవసరం...** ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత ఉందని, అరకు వంటి ప్రాంతాల్లో మహిళలు సికిల్ సెల్ అనీమియాతో పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మీరు ఎంతో బిజీగా ఉన్నా, నెలలో ఒక రోజు పేదల కోసం కేటాయించండి. అంకాలజిస్టులు, గైనకాలజి స్టులు, పీడియాట్రిషియన్లు వంటి నిపుణులు పల్లెల్లో శిబిరాలు నిర్వహించాలి.మీసేవా కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి అండగా ఉంటారు" అని హామీ ఇచ్చారు.

**మొబైల్ డెంటల్ స్క్రీనింగ్ వాహనాలు..** అంతకుముందు, పిఠాపురం నియోజకవర్గ ప్రజల కోసం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, నియో సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'మొబైల్ డెంటల్ స్క్రీనింగ్' వాహనాలను ఆయన ప్రారంభించారు. 3డీ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికత కలిగిన ఈ వాహనాలు పేదలకు ఉచితంగా దంత వైద్యం అందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు డెంటల్ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, శాసనసభ్యులు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, రాంకోసా ప్రతినిధులు మరియు వైద్య కళాశాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ ఆదిత్య పాఠశాలలో సంక్రాంతి క్రాంతి





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** స్థానిక శ్రీనగర్ ఆదిత్య పాఠశాలలో సంక్రాంతి క్రాంతితో ఉత్సవ్ 2ఖ26 పేరిట జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, ప్రిన్సిపాల్ టి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి, కో-ఆర్డినేటర్ రజనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ డా. దామెర విజయలక్ష్మి, ప్రత్యేక అతిథిగా ప్రముఖ ఆర్టిస్ట్ విక్రమ్ జిత్ పాణిగ్రహి, సంక్రాంతి పోటీలకు న్యాయనిర్ణేతగా మహాలక్ష్మి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథి దామెర విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో పండుగలు కూడాఅంతర్భాగమని అన్నారు. విక్రమిత్ పాణిగ్రహి మాట్లాడుతూ మన పండుగలు మరువలేనివి అని అన్నారు. ప్రిన్సిపాల్ టి.రమేష్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను భావిపౌరులకు తెలియజేయడానికి ఆదిత్య వేదిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవ్ 2కె26 పేరిట సంక్రాంతి సంబరాలు జరిపామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేయబడిన బొమ్మల కొలువు, గరగల నృత్యం, గంగిరెద్దుల ఆట, హరిదాసు, కొమ్మదాసరి, గొబ్బెమ్మలు, భోగిమంటలు,భోగిపళ్ళు పోయుట ప్రాంగణంలో సంక్రాంతికే సందడి తెచ్చాయి.

విద్యార్థుల తల్లిదండ్రులందరూ సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రధానం జరిగింది. అనంతరం ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరి లక్ష్మిరాజ్యం, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు ఎన్.శృతిరెడ్డి, ఎన్.సుగుణ రెడ్డి విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు మరియు ఉపాధ్యాయులకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# కాకినాడ నగరపాలక సంస్థలో సంక్రాంతి సంబరాల్లో చెస్ పోటీలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేషన్, సచివాలయం ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం చెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ హాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ చెస్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలలో మొత్తం 16 మంది నగరపాలక సంస్థ ఉద్యోగులు పాల్గొని తమ మేధస్సు, వ్యూహాత్మక ఆలోచన, నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ చెస్ పోటీలను నగరపాలక సంస్థ సూపరెంటెంట్ సీతారాం, జయరాం లు పర్యవేక్షించారు. ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో ప్రథమ బహుమతిని డబ్ల్యుఈడిపిఎస్ విభాగానికి చెందిన కె.రవికుమార్, ద్వితీయ బహుమతిని డబ్ల్యూఎస్ విభాగానికి చెందిన ఎ. కృష్ణకుమార్, తృతీయ బహుమతిని డబ్ల్యుడబ్ల్యుడిఎస్ విభాగానికి చెందిన ఎం.వి.వి.సత్యనారాయణ కైవసం చేసుకున్నారు.

ఈ చెస్ పోటీల విజేతలకు సంక్రాంతి సంబరాల ముగింపు కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి, స్నేహభావం, మానసిక చురుకుదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయని తెలిపారు.

# అశోక్‌నగర్ 'ఆదిత్య'లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆదిత్య స్కూల్ అశోక్‌నగర్ బ్రాంచ్‌లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రాంగణం సంప్రదాయ అలంకరణలతో సందడిగా మారింది. భోగి పళ్ళు, భోగి మంటలు వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగోలి పోటీలు, హౌజీ, తగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు అందరినీ అలరించాయి. పాల్గొన్న తల్లిదండ్రులకు అనేక ఆకర్షణీయ బహుమతులు అందజేశారు. డైరెక్టర్ శ్రుతి రెడ్డి ఈ సందర్భంగా రైతుల కృషిని గుర్తు చేసుకోవాలని ఆమె తన మాటల్లో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీవిద్య, సిబ్బంది తల్లిదండ్రులకు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు సంప్రదాయ వస్త్రధారణలో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. మొత్తంగా వేడుకలు ఆనందం, ఐక్యతతో విజయవంతంగా ముగిశాయి.

# జ్యోతుల శ్రీనివాస్‌ని అభినందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** శనివారం కాకినాడ రంగరాయ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహించిన డాక్టర్స్ మీటింగ్‌లో ప్రత్యేకంగా పిఠాపురం జనసేన సీనియర్ నాయకులు యు.కొత్తపల్లి మండలం సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత జ్యోతుల శ్రీనివాస్‌ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించడం జరిగింది. దీంతో కొత్తపల్లి మండలంలో జనసేన నాయకులు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

# 'బీవీసీ'లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక బివిసి ఇంజనీరింగ్ కళాశాలలో బివిసిఈ క్రాంతి-26 పేరిట సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ఛైర్మన్ బోనం కనకదుర్గ రాణి మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులకు సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొల్పి ఈ సంబరాలు అంబరాన్ని అంటేలా, కళాశాల ఖ్యాతిని నలు దిశలా చాటేలా, విద్యార్థినీ విద్యార్థులు మరియు అధ్యాపక అధ్యాపక ఇతర బృందం అత్యంత ఉత్సాహంతో నిర్వహించారు. ఈ వేడుకలలో సాంప్రదాయ దుస్తులు, రంగవల్లులు, మంగళ వాయిద్యాలు, నృత్యాలు, భోగి మంటలు, తెలుగు సాంప్రదాయ వంటకాలు, కొమ్మ దాసరులు, ప్రభలు, పందిళ్లు, ఎడ్ల బళ్ళు, కేరళ సాంప్రదాయ వాయిద్యాల ప్రదర్శనలతో విద్యార్థులు అందరినీ అలరించారు. ఈ వేడుకలలో పాల్గొన్న కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్ పర్సన్ బోనం కనక దుర్గ, ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ ఏ.ప్రవీణ్, కార్యనిర్వహణాధికారి ఏ.వై.ఆర్.వి.ప్రసాద్, వివిధ విభాగాధిపతులూ, విద్యార్థినీ విద్యార్థులను, నిర్వాహకులనూ అభినందించారు.

# బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ పోలీస్ సిబ్బందికి యూనిఫామ్ అందజేత

– అందించిన జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి





**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ అంకంపాలెంవారు ఆత్రేయ పురం స్టేషన్ పోలీస్ సిబ్బంది 22మందికి ఒక జత యూనిఫాం స్టిచ్చింగ్‌తో సహ బాపనమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కరుటూరి నరసింహారావు వారికి అందజేశారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఆదివాసీ వాల్మీకి తెగలో ఐక్యతకు ప్రాముఖ్యత





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఆదివాసీ వాల్మీకి తెగ ప్రజలు హక్కులు సాధనలో ఎలాంటి విభేదాలు లేకుండా ఐక్యంగా ఉండాలని వాల్మీకి నేతలు సంఘటితంగా పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ గ్రామంలో రాష్ట్ర ఆదివాసీ వాల్మీకి సమ్మేళనం శనివారం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్‌కి వాల్మీకి ఆచారం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వక్తలు రాష్ట్ర జానపద కలల సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరి గంగులయ్య మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ గతంలో వెబ్‌సైట్‌లో వాల్మీకి తెగను కొందరు కావాలనే తొలగించారని అలాంటి సమయంలో పాడేరులో చేసిన ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. రాష్ట్ర నాయకులు రామారావు, శెట్టి గంగాధర స్వామి తదితరులు మాట్లాడుతూ మిగిలిన తెగల్లో కలిసి ఉంటున్నట్టే మనం కూడా కలిసిమెలిసి ఉండాలన్నారు. రాజ్యాంగ బద్దంగా మనకు ఉన్న హక్కులు సాధనలో ఎలాంటి రాజీ లేకుండా ముందుకు సాగాలని కోరారు. అలాగే మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత తదితరులు సభను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ఆదివాసీ వాల్మీకి సమ్మేళనం కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్‌కి ఆదివాసీ వాల్మీకి పోలవరం జిల్లా అధ్యక్షులు గొర్లె చిన నారాయణ ఆధ్వర్యంలో నేతలు ఘన స్వాగతం పలికారు. సమ్మేళనం కార్యక్రమానికి కన్వీనర్‌గా ఉన్న విజయ్ భాస్కర్ మాట్లాడుతూ అన్ని గిరిజన తెగలతో ఐక్యంగా ఉండాలన్నారు. అలాగే జాతి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అందరూ బాగుండాలని అందులో మనం కూడా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో అతిధులకి ఆయన నేతృత్వంలో జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షులు దూలి డేవిడ్ రాజ్, రాష్ట్ర ఆదివాసీ హక్కులు నాయకులు బోండ్ల ప్రసాద్, కింటుకూరి లక్ష్మణరావు ఘన సన్మానం చేశారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి జడ్పీటీసీ బాలాజీ బాబు, బేబీరత్నం, జుర్రా జాన్ బాబు, ఆదివాసీ నాయకులు మఠం ఆదియ్య, వాసా సత్యనారాయణ, నడిగట్ల రమేష్,అక్కపల్లి పండు, డొక్కులూరి రామారావు, గొర్లె బాబీ,వి.అప్పారావు, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మై భారత్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ ఆటల పోటీలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల మరియు క్రీడ మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ గ్రౌండ్ కాకినాడ డిస్ట్రిక్ట్ లెవెల్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ విద్యార్థుల్లోనూ యువతలోనూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అథ్లెటిక్స్ కోచ్ నంది పాపారావు మరియు సత్య మేడమ్ మరియు గోపి అధ్యక్షత వహించి ఆటలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, మరియు పరుగు పందాల్లో యువతీ యువకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వి. సతీష్ కుమార్, ఫౌండర్ అండ్ చైర్మన్ మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కాకినాడ ఎం సత్యనారాయణ, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిఆర్ బి రాంగోపాల్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రకాష్,



ఇతర అధ్యాపక బృందం మరియు చీరా, మై భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అలరించిన సంక్రాంతి సంబరాలు



కాకినాడ,మేజర్న్యూస్ : స్థానిక ఆదిత్య పాఠశాల, జగన్నాధపురం నందు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి, విద్యార్థులందరికి భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగల విశిష్టతను తెలియజేసే విధంగా పాఠశాలను ఎంతో కళకళలాడే లాగ అందంగా తీర్చిదిద్దారు. ఈ పండుగల యొక్క విశిష్టలను విద్యార్థులందరికి తెలియజేశారు. విద్యార్థులు హరిదాసులుగా, జంఘమదేవరలుగా, వేషాలు ధరించి వారి గొప్పదనాన్ని అందరికి తెలియజేసారు. ఈ పండుగలు కుంటుంబాలలో ఆనందాన్ని అందరి బంధువుల మధ్య ఐకమత్యాన్ని పెంచుతాయని, విద్యార్థులు ఈ పండుగల నుంచి మంచి విషయాలను నేర్చుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.సుప్రజారాణి తెలియజేశారు. గంగరెద్దుల విన్యాసాలు, బోగి మంటలు, చిన్న పిల్లలకు బొగిపళ్ళు అందరిని అలరించాయి.

ఈ సంధర్భంగా విద్యార్థులకు ముగ్గులపోటీలు, గాలి పటాల పోటీలు, కబ్బడీ, వివిధ ఆటపాటలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థిని విద్యార్థులందరూ ఎంతో ఆనందంగా సంక్రాంతి పండుగను ముందుగానే చేసుకుని ఆనందించారు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల చైర్మెన్ ఎన్.శేషారెడ్డి మరియు డైరెక్టర్ ఎన్. శృతిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనాగవేణి మరియు అడ్మినిస్ట్రేటర్ ముత్తు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటరులో సంక్రాంతి సంబరాలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక మంచినీటి చెరువుగట్టుపై ఉన్న ఎనిమిదవ నెంబరు అంగన్వాడి సెంటర్‌లో శనివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ పూర్ణిమ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంగన్వాడి సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వారి ప్రదర్శనలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సిడిపిఓ పూర్ణిమ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను అలవార్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు పట్ల విధేయులుగా ఉంటూ, పండుగ సందర్భాల్లో సాంస్కృతిక అలవాట్లును చూసి నేర్చుకోవాలని, మొదటి గురువు తల్లిదండ్రులని సంక్రాంతి పండుగ విశేషాలను వివరించారు. చిన్నారులకు భోగి పళ్ళు వేశారు. అనంతరం బోగి మంట, రంగురంగుల ముగ్గులు వేసి కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు కే.ప్రమీల, ఏ.గంగాభవాని, బి.సుజాత, ఎస్.చంటమ్మ, మణి కుమారి, చెల్లయమ్మ, బేబీ, మార్తా, సీతామహాలక్ష్మి, అంగన్వాడి ఆయాలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీల సంరక్షణ మాతృత్వ అభియాన్ లక్ష్యం



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** దేశంలోని నిరుపేద మధ్యతరగతి గర్భిణీ స్త్రీల సంరక్షణే ధ్యేయంగా ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు పండ సతీష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అడ్డతీగలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల 9 10 తేదీల్లో నిర్వహించే మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణీలకు బాలింతలకు అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులకు తగ్గట్లు మందులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు ప్రసవానికి ముందు గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరీక్షల అనంతరం రంపచోడవరం నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ డాక్టర్ మేమినా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 58 మంది గర్భిణీ స్త్రీలు వివిధ రకాల పరీక్షలు మందులు తీసుకోగా ఆసుపత్రి కౌన్సిలర్ నారే వాసు మరో వైద్యాధికారి మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శనేశ్వరునికి భక్తుల పూజలు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు.

తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి,అనంతరం భక్తులచే తైలాభిషేకాలు, సర్వ దర్శనములు జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంఛార్జి ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ. 3,69,671 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.


## పెరవలి.. పెనుగొండ రోడ్డు తెరవకపోవడంతో పండుగ అతిధుల అగచాట్లు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి నుండి పెనుగొండ వెళ్లే రోడ్డు పై డిసెంబర్ 8వ తేదీ నుండి జనవరి 10వ తేదీ వరకు మాత్రమే ట్రాఫిక్ ఆంక్షలు అన్న ఆర్అండ్బి అధికారులు జాడ ఏది అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దేశ విదేశాల నుండి ఇతర రాష్ట్రాల నుండి భారీ ఎత్తున కార్లలో సొంత ఊర్లకు వస్తున్న అతిథులు రోడ్డును తెరవకపోవడంతో ఎటు వెళ్ళాలో తెలియక నానా అగచాట్లు పడుతున్నారు. ఆర్అండ్బి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే తూర్పు విప్పర్రు, నారాయణపురం మరియు రాపాక గ్రామాల పరిధిలో కొత్త సిమెంట్ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో పెనుగొండ నుండి పెరవలి వెళ్లే మార్టేరు-ప్రక్కిలంక రహదారిపై 2025 డిసెంబర్ 8వ తేదీ నుండి 2026 జనవరి 10వ తేదీ వరకు ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రహదారులు మరియు భవనముల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు తెలియజేశారు. ఈ కాలంలో రహదారి మూసివేత కారణంగా అన్ని వాహనాల రాకపోకలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించబడతాయి అని అధికారులు అప్పట్లో తెలియజేశారు. ట్రాఫిక్ మళ్లింపు వివరాలు కూడా ఈ క్రింది విధంగా ఇచ్చారు పెనుగొండ-- తణుకు/పెరవలి దిశకు ప్రయాణించే బస్సులు, లారీలు పెనుగొండ - మార్టేరు - ఆలమూరు - కొత్తపాడు - ఇరగవరం మార్గం ద్వారా తణుకు / పెరవలి వైపు ప్రయాణించవలెను అన్నారు.

పెరవలి నుండి పెనుగొండ దిశకు వస్తున్న బస్సులు, లారీలు పెరవలి - సిద్ధాంతం - వడలి - పెనుగొండ మార్గం ద్వారా పెనుగొండ చేరవలెను అన్నారు. అయితే ఇవన్నీ స్థానికులకు తెలుసు కానీ దూరప్రాంతాల నుండి వచ్చిన వారికి తెలియక వారు నానా అగచాట్లు పడుతున్నారు. జనవరి 10వ తేదీ నుండి రోడ్డు తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోకపోవడంతో పండుగ అతిథులు, స్థానికులు తీవ్ర అగ్రహావేషాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం కార్లకు, మోటార్ సైకిల్ లకు అయినా అనుమతి ఇవ్వాలని అందుకు తగిన ఏర్పాట్లు చేసి రహదారిని తెరవాలని వారు కోరుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రహదారులు మరియు భవనాల శాఖ అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గోవింద నామస్మరణతో మార్మోగిన వెంకన్న ఆలయం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.

స్వామివారికి నీరాజనం మంత్రపుష్పం పుణ్యా వచనం కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. శనివారం స్వామివారి ఆదాయం రూ.45 లక్షలు సమకూరింది. స్వామివారిని ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, అదన్నపు జిల్లా న్యాయమూర్తి ఎం.అనురాధ రెడ్డి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షంచారు.

## వైభవంగా శ్రీ ప్రకాష్ 18వ వార్షికోత్సవం

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మార్గదర్శి ఎండి శైలజా కిరణ్**






**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం రామారావుపేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఆ పాఠశాల యొక్క 18వ వార్షికోత్సవ చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మా ్గదర్శి చిట్ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజ కిరణ్ విచ్చే శారు. ఆమె మాట్లాడుతూ నేటి కాలంలో మనుషులు మధ్య విలువలు తగ్గిపోతున్నాయని ఆ విలువలను మనమంతా కాపాడుకోవాలని అప్పుడే మన భవితత్వం బంగారమయం అవుతుందని చెబుతూ విలువలు విద్యను అంశంగా తీసుకొని, విద్యార్థులు అందరూ ఆదర్శంగా ప్రదర్శించిన ప్రదర్శనలు ఎంతో ఆలోచింపచేసినవిగా ఉన్నాయని చెబుతూ విలువలను తమ ప్రార్థనలో భాగం చేసుకున్న శ్రీ ప్రకాష్ పాఠశాలలను పాఠశాల విద్యార్థులను మెచ్చుకున్నారు.

మరో అతిధి శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.కేశవరావు మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు ఈ వారికోత్సా వం ద్వారా మన విలవులు మనకు కళ్ళకు కట్టినట్లుగా చూపించారని పిల్లలు ప్రదర్శించిన ప్రతీ ప్రదర్శన కూడ చాలా ఆకట్టుకుందని కితాబునిచ్చారు.శ్రీ ప్రకాష్ సీనర్జీ పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. విజయ ప్రకాష్ మాట్లాడుతూ విలువలు మన కుటుంబాల ద్వారానే మొదలవుతాయని ప్రతి ఇంట్లోనూ పెద్దలను చూసి మాత్రమే ఏ విషయమైనా పిల్లలు నేర్చుకుంటారని వారందరికీ మంచి విలువలను నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రతీ తల్లిదండ్రులకు ఉందని ఆకాంక్షించారు. ఆ బాధ్యతను ప్రతి ఒక్కరు పాటించాలని ఈ వార్షికోత్సవంలో వద్యార్థులు ప్రదర్శించిన యోగా, కలరే పట్టు (కేరళ యుద్ద విద్య) కర్ర సాము( సెలంబం)రోప్‌స్కిప్పింగ్ మరియు మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ , మిత్రదేవోభవ, సంఘదేవోభవ, ప్రకృతిదేవోభవ, కర్తవ్యదేవో భవ అనే విషయాలు ద్వారా చేసిన మయాబజారు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖండవల్లి అంగన్వాడీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



పెరవలి, మేజర్ న్యూస్ : ఖండవల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లలో సిబ్బంది సంయుక్తంగా జనవరి 10వ తేదీ శనివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హరిదాసును పిలిచి హరిదాసు అక్షయపాత్రలో పిల్లలతో బియ్యం పోయించి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిభంభించేలా అంగన్వాడి సెంటర్లో సంక్రాతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగ సమయాలలో పూర్వీకులు మనకు అందించిన సాంస్కృతిక ఆచారవ్యవహారాలను పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోగి పళ్ళు వేశారు. అనంతరం బోగి మంట, రంగురంగుల ముగ్గులు వేయించారు. ఈ కార్యక్రమంలో ఖండవల్లి గ్రామంలోని అంగన్వాడీ వర్కర్లు, అంగన్వాడి ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ నిర్వహణకు కంబాల ఆర్థిక సాయం



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలో తొమ్మిదో తేదీ నుండి ఈనెల 30వ తేదీ వరకు జరుగుతున్న అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన ఖర్చులకు గాను గోకవరంకి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బిజెపి నాయకుడు కంబాల శ్రీనివాసరావు 50 వేల రూపాయల నగదును శనివారం అందించారు తెలుగుదేశం పార్టీ యువనేత బేరా బాలయోగి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ భారీ ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో 12 మండలాలకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొనడంతో వారికి అందించే వసతుల్లో ఎటువంటి లోటుపాట్లు రాకుండా నిర్వాహకులకు తన వంతు ఆర్థిక సాయంగా 50 వేల రూపాయలు అందించినట్లు బాలయోగి అండ్ కో పేర్కొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు కంబాల శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేద వృద్ధులకు రగ్గులు, మహిళలకు చీరలు పంపిణీ చేసిన పాస్టర్ ఇమాన్యుల్ దంపతులు







**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పేద వృద్ధులకు రగ్గులు, మహిళలకు చీరలు స్థానిక యేసుక్రీస్తు ప్రధాన మందిరం పాస్టర్ ఇమ్మానియేల్, పుష్ప ప్రభావతులు పంపిణీ చేశారు. స్థానిక బీసీ కాలనీలో ఉన్న ప్రార్థన మందిరంలో క్రీస్తు సందేశం అనంతరం పంపిణీ చేయడం జరిగింది. దేవుడు గతించిన సంవత్సరం దేవుడు సర్వ మానవాళిని కాచి కాపాడి మరొక సంవత్సరంలో అడుగు పెట్టించేవాడు ఆ దేవుడు మాత్రమే. 2025 సంవత్సరాల క్రితం ఆయన మనకోసం ప్రాణత్యాగం చేయడం జరిగిందని పాస్టర్ ఇమ్మానియేల్ అన్నారు. అలానే కాకరపాడు చర్చికు చెందిన గ్రామాలలో చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని 30 మందికి రగ్గులు, చిన్నారులకు స్నాక్స్ అందజేశారు.

# కోనసీమ ప్రభల సంబరం

- భక్తి, సంస్కృతుల మేళవింపుపై పోలీసుల 'రక్షా' కవచం
- క్షేత్రస్థాయిలో ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షణ.. కొత్తపేటలో భారీ ఏర్పాట్లు
- సంప్రదాయం ముసుగులో అల్లర్లకు పాల్పడితే ఉక్కుపాదమే
- జిల్లా ఎస్పీ హెచ్చరిక



**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** గోదావరి గడ్డపై సంక్రాంతి సంబరాలకు పరాకాష్ట 'ప్రభల తీర్థం'. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ సంప్రదాయ వేడుకను కేవలం వినోదంగానే కాకుండా, కోనసీమ ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రభల ఉత్సవాలను ఎటువంటి మచ్చ లేకుండా, ప్రశాంతంగా నిర్వహించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్వయంగా రంగంలోకి దిగారు. కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించి, భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడంలో తనదైన ముద్ర వేస్తున్నారు.

**-క్షేత్రస్థాయి పరిశీలన : భద్రతపై అంచనా**

శనివారం కొత్తపేటలోని జూనియర్ కళాశాల మరియు హైస్కూల్ మైదానాలను ఎస్పీ సందర్శించారు.ఈసందర్భంగా ప్రభలు వచ్చే మార్గాలు, భక్తులు గుమిగూడే ప్రదేశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

-ట్రాఫిక్ వ్యూహం : లక్షలాది మంది తరలివచ్చే ఈ తీర్థంలో తొక్కిసలాట జరగకుండా, వాహనాల రద్దీని నియంత్రించేందుకు 'డైవర్షన్ ప్లాన్‌'ను సిద్ధం చేశారు. పార్కింగ్ స్థలాల వద్ద సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**-క్రౌడ్ మేనేజ్‌మెంట్:**

కొత్తపేట డీఎస్పీ మురళీ మోహన్‌తో కలిసి మైదానంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లపై దిశానిర్దేశం చేశారు.

-వివాదాలపై ఉక్కుపాదం : ఎస్పీ కఠిన హెచ్చరిక

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎస్పీ అత్యంత లోతైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రభల ఊరేగింపులో ప్రదర్శించే ఫ్లెక్సీల విషయంలో నిబంధనలు కఠినతరం చేశారు. "సంస్కృతిని గౌరవించడం అంటే ఇతరుల మనోభావాలను దెబ్బతీయడం కాదు. ఫ్లెక్సీలపై వివాదాస్పద వ్యాఖ్యలు ఉన్నా, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేసినా చట్టం తన పనితాను చేసుకుపోతుంది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లు తెరిచేందుకు కూడా వెనుకాడం."అని ఎస్పీ అత్యంత తీవ్రంగా హెచ్చరించారు.

**-సమన్వయంతోనే సంబరం**

పోలీసు యంత్రాంగం కేవలం రక్షణకే పరిమితం కాకుండా, ఉత్సవ కమిటీలతో మమేకమై పండగను విజయవంతం చేయాలని భావిస్తోంది. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తలు, అత్యవసర వైద్య సదుపాయాలు, మంచినీటి లభ్యత వంటి అంశాలపై ఎస్పీ ఆరా తీశారు. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా నిమిషాల వ్యవధిలో స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను రంగంలోకి దించుతున్నారు.

# థాంక్యూ డీసీఎం...



- గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ నూతన బ్రిడ్జిని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- థాంక్యూ సీఎం ప్లకార్డులు ప్రదర్శించిన కాలనీ వాసులు

**పిఠాపురం/ గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించారు. బ్రిడ్జి మొత్తం తిరిగి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుద్దగడ్డ కాలువపై పవన్ కళ్యాణ్ ఆదేశాలతో... రూ. 3.05 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది. 2024 సెప్టెంబర్ లో పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా హౌసింగ్ కాలనీ సందర్శనకు వచ్చిన సందర్భంలో కాలనీ వరద ముంపులో ఉంది. పడవపై వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కాలువకు వరద వచ్చిన ప్రతిసారి ముంంపునకు గురవుతో ందని, రాకపో కలకు ఇబ్బంది పడుతున్నామని, వరదలు వచ్చిన ప్రతిసారి జనజీవనం స్తంభించి పో తుందని వాపోయారు. ఆ సందర్భంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఉప ముఖ్య మంత్రి హామీ ఇచ్చారు.ఆ మేరకు కార్యాచరణ రూపొందించి హామీ నెరవేర్చారు. శుక్రవారం సంక్రాంతి మహోత్సవ వేదికపై లాంఛనంగా బ్రిడ్జిని ప్రారంభించి శనివారం బ్రిడ్జి నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భ ంగా ముంపు కష్టాలు తొలగించిన ఉప ముఖ్యమంత్రికి కాలనీ వాసులు, స్కూలు పిల్లలు థాంక్యూ డిప్యూటీ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. ఈ పరిశీలనలో డిప్యూటీ సీఎం వెంట జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఆర్ అండ్ బి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# యువత క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలి





- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎస్టీ కమిషన్ చైర్మన్

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో యువత క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని, అందరూ కలిసి మెలిసి సోదర భావంతో పోటీలు నిర్వహించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి సూచించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. పోలవరం నూతన జిల్లా రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షులు ముర్ల బాలురెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. క్రికెట్ టోర్నమెంట్‌లో ముఖ్యఅతిథిగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత క్రీడల ద్వారా దేశ గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి క్రీడాకారులతో కలిసి స్నేహపూర్వకంగా క్రికెట్ ఆడారు. క్రీడాకారులతో కలిసి ఆటల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కూటమి నాయకులు, జనసేన పార్టీ నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకుల సమక్షంలో టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు.

పోలవరం జిల్లాలోని మొత్తం 12 మండలాల క్రికెట్ జట్లతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షులు ముర్ల బాలు రెడ్డి ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పిఠాపురం ప్రజల అభిమానం ఎన్నటికీ మరువలేనిది

- మెగా బ్రదర్ ఎమ్మెల్సీ కె.నాగబాబు
- రోజు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న నాగబాబు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ ప్రజల ఎన్నటికీ మరువలేనిదని మెగా బ్రదర్, ఎమ్మెల్సీ కె. నాగబాబు అన్నారు. పిఠా పురంలో జరుగు తున్న పీఠికాపురం సంక్రాంతి సంబరాలలో భాగంగా రెండో రోజు శనివారం జరిగిన సంక్రాంతి సంబరాలలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కె .నాగబాబు మాట్లాడుతూ... సంక్రాంతి సందర్భంగా అందరి జీవితాల్లో ఆనంద సంతోషాలు వెల్లివిరియాలని పిఠాపుర వాసులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పిఠాపురంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పీఠికాపుర సంక్రాంతి సంబరాల్లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఒకటిన్నర సంవత్సర కాలంలో పిఠాపురం నియోజకవర్గంలో గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సుమారుగా రూ.500 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విశేషమన్నారు. పవన్ కళ్యాణ్ లాంటి బలమైన వ్యక్తిని నియోజకవర్గ శాసనసభ్యుడిగా గెలిపించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నిలిపిన మీ అభిమానం తన జీవితానికి నిజమైన ఆనందాన్నిచ్చిందని, పిఠాపురం ప్రజలందరికి జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జెడ్పీ సీఈవో, ఇన్చార్జి జిల్లా పర్యటక అధికారి వీవీఎస్.లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి, డ్వామా పిడి ఎ.వెంకటలక్ష్మి, తదితర అధికారులు హాజరై ప్రదర్శనలు తిలకించారు. అనంతరం కళాకారులకు మెమెంటోలు అందజేసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్ మల్లికార్జునరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, రాజమండ్రి విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ; డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ ఏఈఐఈ సీ.బాబూరావు, డీసీవో బి.శ్రీనివాసరెడ్డి, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**సోమనాథ యాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు**



**సామర్లకోట మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ సోమ నాథ యాత్ర విజయ వంతం కావాలని కోరు తూ బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు పం చరామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సోమనాద పరిక్రమ యాత్ర ప్రారంభం కానున్నట్లు విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామి ఆలయంలో బిజెపి రాష్ట్ర నేత డా.గౌరకపూడి చిన్నయ్య దొర ఆధ్వర్యంలో బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు.

ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు శర్మ, వెంకన్న శర్మ, మూర్తి వినయ్ శర్మ స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం బిజెపి నేతలకు పండితులు వేద ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో సోమనాథ పరాక్రమ యాత్ర ప్రారంభమవుతుం దన్నారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వలో భాగంగా నిర్వహించే యాత్రలో హిందువుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు జనరల్ సెక్రెటరీ జానీ మోజెస్, అర్జున్ రావు, వల్లూరి బులియ్య, పుప్పాల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం కొండపై 'సామాన్యుడి' పాలన





**– ఈవో త్రినాథరావు మార్క్ అడ్మినిస్ట్రేషన్!**

అరిటాకులో విందు.. అధికారిలోని నిండుతనం!

"కుర్చీ ఇచ్చే గౌరవం కంటే.. తోటి మనిషి ఇచ్చే ప్రేమే గొప్పదని నిరూపించారు. సామాన్యుల క్యూలో నిలబడి, వారి మధ్యే కూర్చుని భోజనం చేస్తున్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాదు, గుండెలను హత్తుకుంటోంది. వేంద్ర త్రినాథరావు తింటున్నది కేవలం అన్నం కాదు.. భక్తులకు అందుతున్న సేవల నాణ్యతను, వారి కష్టసుఖాలను ప్రత్యక్షంగా పంచుకుంటున్నారు. 'సామాన్యుడే దేవుడు' అని నమ్మే ఇలాంటి అధికారులు మనకు కావాలి. దళారుల వ్యవస్థపై ఉక్కుపాదం మోపుతూ ఆయన సాగిస్తున్న 'మార్క్' పాలన ఇప్పుడు రత్నగిరిపై కొత్త కాంతులు విరజిమ్ముతోంది. సత్యదేవుని సాక్షిగా సాగుతున్న ఈ ప్రక్షాళన పర్వంపై 'సూర్య బ్యూరో' ప్రత్యేక కథనం..."

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

కలియుగ దైవం, కోరిన కోర్కెలు తీర్చే సత్యదేవుని సన్నిధిలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి (ఈవో) వేంద్ర త్రినాథరావు బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తనదైన శైలిలో పరిపాలన సాగిస్తూ భక్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆడంబరాలకు పోకుండా, క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుంటూ ఆయన సాగిస్తున్న పర్యవేక్షణ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

రాజభోగం కదు... ప్రజాపంక్తిలో ప్రసాదం

తాజాగా శనివారం నాడు ఈవో త్రినాథరావు అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా, ఒక సాధారణ భక్తుడిలా అన్నదాన సత్రానికి వెళ్లారు. అక్కడ క్యూలైన్లో నిలబడి, సామాన్య భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

– నాణ్యత పరిశీలన: వడ్డన తీరును, భోజనం నాణ్యతను స్వయంగా రుచి చూసి తెలుసుకున్నారు.

– భక్తులతో ముఖాముఖి: పక్కనే కూర్చున్న భక్తులతో ముచ్చటించి, వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

– సిబ్బందికి షాక్: ఉన్నతాధికారి తమ మధ్యే కూర్చుని భోజనం చేస్తున్న విషయం గమనించిన సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.

దళారుల వేట.. భక్తులకు ఊరట

గత కొంతకాలంగా కొండపై భక్తులను ఇబ్బంది పెడుతున్న దళారుల వ్యవస్థపై ఈవో ఉక్కుపాదం మోపారు.

– వ్రతాల నిర్వహణ: సత్యనారాయణస్వామి వ్రతాల వద్ద ఎటువంటి అక్రమాలు జరగకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

– ధరల నియంత్రణ: అధిక ధరలకు అడ్డుకట్ట వేస్తూ, సామాన్యుడికి భారం కాకుండా చర్యలు చేపట్టారు. ఈ ప్రయత్నాలు ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

– పరిశుభ్రతకు పెద్దపీట: ఆలయ ప్రాంగణం, భోజనశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

భక్తులు మెచ్చేలా.. స్వామివారి సేవలో..

సనాతన ధర్మం, హైందవ సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా త్రినాథరావు చేస్తున్న మార్పులు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. అంచెలంచెలుగా పాలనా విభాగాలను ప్రక్షాళన చేస్తూ, భక్తుల సౌకర్యార్థం ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మార్పు చూస్తుంటే, అన్నవరం కొండపై సత్యదేవుని దర్శనం మరింత సులభతరం, సౌకర్యవంతం కానుందని స్పష్టమవుతోంది.

# మాజీ ఎమ్మెల్యే సోమసుందర్ రెడ్డి జయంతి



**– పూలమాలలు వేసి నివాళులర్పించిన చిర్ల జగ్గిరెడ్డి**

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తండ్రి చిర్ల సోమసుందర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమానికి జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ విచ్చేసి స్థానిక నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

అనంతరం జగ్గిరెడ్డితో కలిసి నియోజకవర్గంలోని గోపాలపురం, ఊబలంక, మెర్లపాలెం గ్రామాలలో పలువురిని పరామర్శించారు.

# ఘనంగా భద్రాచలం రాముల వారి 'విలాసోత్సవం' కార్యక్రమం

**ఎటపాక, మేజర్ న్యూస్ :** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి భద్రాచలంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి "విలాసోత్సవం" కార్యక్రమం సందర్భంగా హరిచంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో శ్రీ గోకులరామంలో స్వామివారి 'విలాసోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ స్వామివారి 'విలాసోత్సవం' కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి, కథకేళి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింప చేయడం జరిగింది. అనంతరం భక్తులందరూ కూడా స్వామివారిని దర్శించుకొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా హరిచంద్ర నాయక్ మాట్లాడుతూ రాములవారికి ఈ సేవ చేసుకునే భాగ్యం నాకు దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని, గత ఆరు సంవత్సరాల నుండి కూడా స్వామివారి విలాసోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం భక్తులు ఎక్కువమంది వచ్చి స్వామివారిని దర్శించుకొని స్వామివారి కృపకు పాత్రులు అవ్వడం జరిగిందని తెలిపారు. ఈ



కార్యక్రమంలో గుండాల ఎంపిటిసి గొంగడి వెంకట రామిరెడ్డి, బుద్ధ ఆదినారాయణ, తాళ్లూరి చిట్టిబాబు, వల్లభనేని చందు, చావ లక్ష్మనారాయణ, జక్కం ప్రసాద్, సోమశేఖర్, పూనెం కృష్ణ, భీమవరపు వెంకటరెడ్డి, కుందూరు రామిరెడ్డి, మూర్తల రామిరెడ్డి, అర్రిమల్ల రామచంద్రరావు, రేపాక రాంబాబు, తిప్పన సిద్దులు, ప్రబోధ్ కుమార్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ జయభారతి మరియు పురుషోత్తపట్నం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** గుర్తు తెలియని వృద్ధురాలు మృతదేహం పంటకాలువలో లభ్యమైనట్లు రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి తెలిపారు. వివరాలు ప్రకారం గోపాలపురం గ్రామ ప్రధాన పంట కాలువలో సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ మృతదేహము ఉన్నట్లు, సదరు మృతురాలు ఎరుపు రంగు జాకెట్టు ఎరుపు రంగు చీర ధరించి మెడలో తెలుపు రంగు పూసల దండ ఉన్నట్లు మృతురాలు ఎగువ ప్రదేశం నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఉండవచ్చునని తెలియజేసినారు. సదరు మృతురాలి మృతదేహమును వారి బంధువులు ఎవరైనా గుర్తించుటకు గాను కొత్తపేట ప్రభుత్వాసుపత్రి మార్చురి షెడ్ వద్దకు తరలించినట్లు తెలిపారు. అయితే మృతురాలు ర్యాలీ గ్రామానికి చెందిన వృద్ధురాలుగా గుర్తించినట్లు తెలిసింది.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శి ంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణా ధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.94,350/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.63, 040/-లు, కేశఖండన ద్వారా రూ.2, 240/-, తులాభారం ద్వారా రూ.200/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.14,700/- మొత్తం రూ.1,74, 530/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామి వారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, వేదపండితులు పెద్దింటి నారాయణా చార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, గ్రామస్థులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలి

**– ఎస్సై వి.మౌనిక**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగను ప్రతీ ఒక్కరూ సంప్రదాయంలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, జూద క్రీడలకు దూరంగా ఉండాలని, ఎస్సై వి.మౌనిక తెలిపారు. అలాగే పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాలలో ఎక్కడ కోడి పందాలు, అశ్లీల నృత్యాలు, గుండాట, జూదం వంటి ఆటలు నిర్వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై వి.మౌనిక పేర్కొన్నారు. పట్టణ, మండల పరిధిలోని గ్రామాలలో డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ నిఘా పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉంటుందని ఎస్సై సూచించారు.